

ప్రశాంతంగా ఓట్ల లెక్కింపు

జిల్లాలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు.

- 12లో ▸



ఉత్కంఠగా..

కామారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఆద్యంతం ఉత్కంఠగా సాగింది.

- 12లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 34.2 /17.1

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. చలిగాలులు వీస్తాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది. పొగమంచు కురుస్తుంది.

విలక్షణ తీర్పు



భిక్కనూరులో సంబురాలు చేసుకుంటున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు



అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రజలు విలక్షణ తీర్పు ఇచ్చారు. ఈసారి అన్ని ప్రధాన పార్టీలను ఆదరించారు. కామారెడ్డి జిల్లాలో నాలుగు నియోజకవర్గాలుండగా రెండుచోట్ల కాంగ్రెస్‌కు పట్టం కట్టిన ఓటర్లు.. బీజేపీ, బీఆర్‌ఎస్‌లను ఒక్కో స్థానంలో గెలిపించారు. నిజామాబాద్ జిల్లాలో ఐదు స్థానాలుండగా.. కాంగ్రెస్, బీజేపీలకు చెరో రెండు సీట్లిచ్చి, అధికార బీఆర్‌ఎస్‌ను మాత్రం ఒక్కస్థానానికే పరిమితం చేశారు.

- అన్ని ప్రధాన పార్టీలను ఆదరించిన ఉమ్మడి జిల్లా ఓటర్లు
- చేయెత్తి జైకొట్టిన ఉమ్మడి జిల్లా.. నాలుగు చోట్ల కాంగ్రెస్ గెలుపు
- మూడు స్థానాల్లో వికసించిన కమలం
- దెబ్బతిన్న కారు.. రెండు సీట్లకే పరిమితం
- ఇద్దరు సీఎం అభ్యర్థులను ఓడించి చరిత్ర సృష్టించిన బీజేపీ అభ్యర్థి కేవీఆర్

సాక్షి, కామారెడ్డి: శాసనసభ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఆదివారం జరిగింది. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయం పక్కనగల గోదాంలో కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాల కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించారు. బాన్సువాడతో పాటు నిజామాబాద్ జిల్లాలోని ఐదు స్థానాల ఓట్లను నిజామాబాద్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో లెక్కించారు. ఓటర్లు విలక్షణ తీర్పు ఇచ్చారు. బాన్సువాడ ఓటర్లు మరోసారి బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన పెద్దాయన పోచారం శ్రీనివాస్‌రెడ్డికే పట్టం కట్టారు. కామారెడ్డిలో బీజేపీ అభ్యర్థి కాటిపల్లి వెంకటరమణారెడ్డిని గెలిపించారు. ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన కే.మదన్‌మోహన్‌రావు, తోట లక్ష్మీకాంతరావ్‌లను విజయతీరాలకు చేర్చారు.

కామారెడ్డి బిగ్‌ఫైట్‌లో సామాన్యుడి గెలుపు

కామారెడ్డిలో బిగ్‌ఫైట్ నడిచింది. ఇద్దరు వీవీఐపీలు బరిలో నిలిచిన ఈ స్థానంలో ఒక సామాన్యుడు బరిగీసి కొట్లాడాడు. మూడోసారి సీఎంగా హ్యాట్రిక్ సాధించాలనుకున్న కేసీఆర్‌ను.. పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిని ఒకే దెబ్బతో మట్టికరిపించి కొత్త చరిత్ర సృష్టించాడు బీజేపీ అభ్యర్థి కె.వెంకటరమణారెడ్డి. తన సమీప ప్రత్యర్థి సీఎం కేసీఆర్‌పై 6,741 ఓట్ల తేడాతో విజయం సాధించారు.

ఎల్లారెడ్డిలో మదన్‌మోహన్‌కు పట్టం..

ఎల్లారెడ్డి నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే జాజాల సురేందర్‌ను ఓడించేందుకు కాలికి బలపం కట్టుకుని తిరిగిన కాంగ్రెస్ అభ్యర్థి కె.మదన్‌మోహన్‌రావు.. విజయ తీరాలకు చేరారు. సామాజిక సేవా కార్యక్రమాలతో జనంతో మమేకమైన ఆయనను ప్రజలు ఆదరించి గెలిపించారు. ఆయన తన సమీప ప్రత్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే సురేందర్‌పై 24,001 ఓట్లతో భారీ విజయాన్ని సొంతం చేసుకున్నారు.

జుక్కల్‌లో గట్టెక్కిన హస్తం

జుక్కల్ నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే హన్మంత్ సింధేపై పోటీ చేసిన కాంగ్రెస్ అభ్యర్థి తోట లక్ష్మీకాంతరావు.. హోరాహోరీ పోరులో 1,152 ఓట్ల స్వల్ప తేడాతో గట్టెక్కారు. ఇక్కడ కాంగ్రెస్ టికెట్టు ఆశించి భంగపడిన మాజీ ఎమ్మెల్యే గంగారాం ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో బీఆర్‌ఎస్ అభ్యర్థికి మద్దతు ప్రకటించారు. అయినా రాజకీయాలకు కొత్త అయిన లక్ష్మీకాంతరావును ప్రజలు గెలిపించారు.

నిజామాబాద్ జిల్లాలో..

నిజామాబాద్ అర్బన్, ఆర్మూర్‌లలో బీజేపీ అభ్యర్థులు సూర్యనారాయణ గుప్తా, రాకేశ్‌రెడ్డి గెలుపొందగా.. బోధన్, నిజామాబాద్ రూరల్‌లలో కాంగ్రెస్ అభ్యర్థులు సుదర్శన్ రెడ్డి, భూపతిరెడ్డి విజయం సాధించారు. బాల్కొండలో మంత్రి ప్రశాంత్‌రెడ్డి గట్టెక్కారు.

అమ్మ ఊరు ఆదరించింది...

సీఎం కేసీఆర్ అమ్మ పుట్టిపెరిగిన బీబీపేట మండలంలోని కోనాపూర్‌లో బీఆర్‌ఎస్‌కు మెజారిటీ లభించింది. ఇక్కడ 919 ఓట్లు ఉండగా 742 ఓట్లు పోలయ్యాయి. ఇందులో కేసీఆర్‌కు 397 ఓట్లు రాగా రేవంత్‌రెడ్డికి 152, వెంకటరమణారెడ్డికి 101 ఓట్లు వచ్చాయి.

బాన్సువాడలో చరిత్ర తిరగరాసిన పోచారం

స్పీకర్‌గా పనిచేసిన వాళ్లు ఓడిపోతారన్న అపోహ బలంగా ఉంది. సుమారు మూడు దశాబ్దాలుగా ఏ స్పీకర్ గెలవకపోవడం దీనికి బలం చేకూర్చింది. పోచారం శ్రీనివాస్‌రెడ్డి విజయం కోసం శ్రమించి, గెలుపు తీరాలకు చేరి నెగెటివ్ సెంటిమెంట్‌కు చెక్ చెప్పారు. ఇక్కడి ప్రజలు అభివృద్ధికి పట్టం కడుతూ వరుసగా ఐదోసారి పోచారంను గెలిపించారు. ఆయన తన సమీప ప్రత్యర్థి, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డిపై 23,464 ఓట్ల తేడాతో గెలిచారు.



కామారెడ్డిలో వెంకటరమణారెడ్డి ఇంట్లో అభివాదం చేస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి



లింగంపేటలో సంబురాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ శ్రేణులు

అవినీతి రహిత పాలన అందిస్తా



వెంకటరమణారెడ్డికి ధ్రువీకరణ పత్రం అందిస్తున్న రిటర్నింగ్ అధికారి

కామారెడ్డి టౌన్: ప్రజలకు అవినీతి రహిత పాలన అందిస్తానని కామారెడ్డి అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన బీజేపీ అభ్యర్థి కాటిపల్లి వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రాత్రి ఆయన కౌంటింగ్ కేంద్రం వద్ద 'సాక్షి'తో మాట్లాడారు. కామారెడ్డి అభివృద్ధే తన ఎజెండా అన్నారు. ఎన్నికల సమయంలో తాను ఇచ్చిన హమీలన్నీ నెరవేరుస్తానన్నారు. మద్యం, డబ్బుకు లొంగకుండా నిజాయితీగల నాయకుడిని ఎన్నుకున్న నియోజకవర్గ ప్రజలందరికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రధాని మోదీ నేతృత్వంలో నియోజకవర్గంలోని ఇళ్లులేని నిరుపేదలకు ఇళ్లు కట్టిస్తానన్నారు. ఒకేసారి ముఖ్యమంత్రితోపాటు మరో ముఖ్యమంత్రి అభ్యర్థిని ఓడించే అవకాశం ఇచ్చిన ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. ఈ ఎన్నికల్లో సుమారు 1.90 లక్షలకుపైగా ఓట్లు పోలయ్యాయని, వచ్చే ఎన్నికల్లో ఈ ఓట్లన్నీ తనకే వచ్చేలా ప్రజలకు పాలన అందిస్తానని పేర్కొన్నారు. ఆయన వెంట బీజేపీ నాయకులు ఉన్నారు.

ప్రజలకు రుణపడి ఉంటా..



పోచారం శ్రీనివాస్‌రెడ్డికి స్వీట్ తినిపిస్తున్న ఆయన సతీమణి పుష్పమ్మ

బాన్సువాడ: స్పీకర్లు ఓడిపోతారనేది కేవలం అపోహ మాత్రమేనని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. నిత్యం ప్రజలతో కలిసి ఉన్నాను కాబట్టే వారు చరిత్రను తిరగరాస్తూ నన్ను గెలిపించారు. ఇప్పటి వరకు ఎనిమిదిసార్లు పోటీ చేస్తే ఏడుసార్లు గెలిపించిన బాన్సువాడ నియోజకవర్గ ప్రజలకు ఎప్పటికీ రుణపడి ఉంటానన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు దేశంలో మరే నియోజకవర్గంలోనూ ఉండకపోవచ్చన్నారు. ప్రజా తీర్పును శిరసావహిస్తామని, కేసీఆర్ నాయకత్వంలో బీఆర్‌ఎస్ తిరిగి ప్రజా సేవకు అంకితం అవుతామని పేర్కొన్నారు.

ఆదర్శంగా తీర్చిదిద్దుతా



ఎన్నికల అధికారినుంచి ధ్రువీకరణ పత్రాన్ని అందుకుంటున్న లక్ష్మీకాంతారావు

నిజాంసాగర్: వెనకబడిన ప్రాంతంగా ఉన్న జుక్కల్ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి, రాష్ట్రానికి తలామానికంగా చేస్తానని కాంగ్రెస్ అభ్యర్థి తోట లక్ష్మీకాంతారావు అన్నారు. ప్రజాసేవ కోసం రాజకీయాల్లోకి వచ్చానన్నారు. ఆదివారం కౌంటింగ్ పూర్తయ్యాక ఆయన విలేకరులతో మాట్లాడారు. జుక్కల్ నియోజకవర్గంలో మౌలిక వసతులు కరువయ్యాయని, విద్య, వైద్యం, రోడ్డు రవాణా సదుపాయాలు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. మూడుసార్లు గెలిచిన ఎమ్మెల్యే హన్మంత్‌సింధే అధికారాన్ని ఉపయోగించుకొని అక్రమంగా ఆస్తులు కూడబెట్టుకున్నారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ నేతలకు ప్రజలు బుద్ధి చెప్పారన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి ప్రజలకు కృతజ్ఞతలు



ధ్రువీకరణ పత్రాన్ని అందుకుంటున్న మదన్‌మోహన్‌రావు

ఎల్లారెడ్డి: భారీ మెజారిటీతో గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు మదన్‌మోహన్‌రావు కృతజ్ఞతలు తెలిపారు. కౌంటింగ్ అనంతరం ఆయన రిటర్నింగ్ ఆఫీసర్ మన్నె ప్రభాకర్ నుంచి ధ్రువీకరణ పత్రాన్ని అందుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పాలన పోలీసుల అండదండలతో కొనసాగిందన్నారు. బీఆర్‌ఎస్ నాయకుల అన్యాయాలకు ప్రజలు ఫుల్‌స్టాప్ పెట్టారన్నారు. కాంగ్రెస్ హయాంలో అన్ని వర్గాల ప్రజలకు నీతివంతమైన పాలనను అందిస్తామన్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానన్నారు.



కౌంటింగ్ కేంద్రంలోకి పోస్టల్ బ్యాలెట్ల బాక్స్‌ను తీసుకువస్తున్న సిబ్బంది

నియోజకవర్గం : కామారెడ్డి

అభ్యర్థి	వచ్చిన ఓట్లు	పార్టీ
కాటిపల్లి వెంకటరమణారెడ్డి	66,652	బీజేపీ
కే చంద్రశేఖర్‌రావు	59,911	బీఆర్‌ఎస్
ఎనుముల రేవంత్‌రెడ్డి	54,916	కాంగ్రెస్

మెజార్టీ 6,741

నియోజకవర్గం : జుక్కల్

అభ్యర్థి	వచ్చిన ఓట్లు	పార్టీ
తోట లక్ష్మీకాంత్‌రావు	64,489	కాంగ్రెస్
హన్మంత్ సింధే	63,337	బీఆర్‌ఎస్
అరుణతార	28,437	బీజేపీ

మెజార్టీ 1,152

నియోజకవర్గం : బాన్సువాడ

అభ్యర్థి	వచ్చిన ఓట్లు	పార్టీ
పోచారం శ్రీనివాస్‌రెడ్డి	76,278	బీఆర్‌ఎస్
ఏనుగు రవీందర్‌రెడ్డి	52,814	కాంగ్రెస్
యెండల లక్ష్మీనారాయణ	23,685	బీజేపీ

మెజార్టీ 23,464

నియోజకవర్గం : ఎల్లారెడ్డి

అభ్యర్థి	వచ్చిన ఓట్లు	పార్టీ
మదన్‌మోహన్‌రావు	86,989	కాంగ్రెస్
జాజాల సురేందర్	62,988	బీఆర్‌ఎస్
వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి	27,000	బీజేపీ

మెజార్టీ 24,001

నియోజకవర్గం : నిజామాబాద్ అర్బన్

అభ్యర్థి	వచ్చిన ఓట్లు	పార్టీ
ధన్‌పాల్ సూర్యనారాయణ	75,240	బీజేపీ
మహ్మద్ అలీ షబ్బీర్	59,853	కాంగ్రెస్
బిగాల గణేశ్ గుప్తా	44,829	బీఆర్‌ఎస్

మెజార్టీ 15,387

నియోజకవర్గం : నిజామాబాద్ రూరల్

అభ్యర్థి	వచ్చిన ఓట్లు	పార్టీ
ఆర్. భూపతి రెడ్డి	78,378	కాంగ్రెస్
బాజిరెడ్డి గోవర్ధన్	56,415	బీఆర్‌ఎస్
కులాచారి దినేశ్	49,723	బీజేపీ

మెజార్టీ 21,963

నియోజకవర్గం : ఆర్మూర్

అభ్యర్థి	వచ్చిన ఓట్లు	పార్టీ
పైడి రాకేశ్ రెడ్డి	72,658	బీజేపీ
వినయ్‌కుమార్ రెడ్డి	42,989	కాంగ్రెస్
ఆశన్నగారి జీవన్ రెడ్డి	39,395	బీఆర్‌ఎస్

మెజార్టీ 29,669

నియోజకవర్గం : బాల్కొండ

అభ్యర్థి	వచ్చిన ఓట్లు	పార్టీ
వేముల ప్రశాంత్‌రెడ్డి	70,417	బీఆర్‌ఎస్
ముత్యాల సునీల్ రెడ్డి	65,884	కాంగ్రెస్
ఏలేటి అన్నపూర్ణమ్మ	30,250	బీజేపీ

మెజార్టీ 4,533

నియోజకవర్గం : బోధన్

అభ్యర్థి	వచ్చిన ఓట్లు	పార్టీ
పి. సుదర్శన్‌రెడ్డి	66,963	కాంగ్రెస్
షకీల్ అహ్మద్	63,901	బీఆర్‌ఎస్
వడ్డీ మోహన్‌రెడ్డి	33,555	బీజేపీ

మెజార్టీ 3,062

జన నేతకు ఘన విజయం

- కేవీఆర్ సక్సెస్ వెనక కఠోర శ్రమ
- ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరుతో గుర్తింపు
- అనుకూలించిన రూ.150 కోట్ల సొంత మేనిఫెస్టో

సాక్షి, కామారెడ్డి: కామారెడ్డి నియోజకవర్గంలో ఐదేళ్లుగా చేస్తున్న అలుపెరగని పోరాటం ఆయనను నాయకుడిగా నిలబెట్టింది. ప్రజల్లో నమ్మకాన్ని పెంచింది. అదే విశ్వాసం ఆయనను ఎమ్మెల్యేగా గెలిపించింది. అది కూడా ఇద్దరు ఉద్దండులను ఓడించి రాష్ట్ర రాజకీయాల్లో తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకునేంతగా.. కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసి విజయం సాధించిన బీజేపీ అభ్యర్థి కాటిపల్లి వెంకటరమణారెడ్డి(కేవీఆర్).. కేసీఆర్, రేవంత్ రెడ్డిలను ఓడించి జాయింట్ కిల్లర్ అన్న పేరు సాధించారు. అయితే ఆయనకు ఈ విజయం అంత సులువుగా దక్కలేదు. దీని వెనుక కఠోర శ్రమ ఉంది. ఆయన చేసిన పోరాటాలు, ఉద్యమాలు ఆయనకు గుర్తింపు తెచ్చాయి.

వెంకటరమణారెడ్డి 2018లో జిల్లా కేంద్రంలో నవయువ భేరి పేరుతో ఓపెన్ డిబెట్ కార్యక్రమాన్ని నిర్వహించి, యువతకు రాజకీయాలపై అవగాహన కల్పించారు. రాజకీయ పార్టీలు, నాయకుల మీద యువతలో ఉన్న అపోహలకు సమాధానాలు ఇచ్చారు. ఆ కార్యక్రమం అప్పట్లో సంచలనం కలిగించింది.

మహిళా సంఘాల వడ్డీ బకాయిల కోసం...

స్వయం సహాయక సంఘాల మహిళలకు రావలసిన పావలా వడ్డీ బకాయిల కోసం 2018 లో వెంకటరమణారెడ్డి నియోజకవర్గంలో పెద్ద ఉద్యమం లేవదీశారు. కామారెడ్డి పట్టణంలో ర్యాలీ తీశారు. బకాయిల కోసం నిరవధిక నిరాహార దీక్షకు దిగడంతో ప్రభుత్వం ఆయనను అరెస్ట్ చేసింది. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు రావలసిన బకాయిలను విడుదల చేసింది. ధాన్యం, మక్కల కొనుగోళ్ల విషయంలో జరిగిన నిర్లక్ష్యంపై ఆయన రైతులతో కలిసి అనేక ఉద్యమాలు చేశారు. ధరణి పోర్టల్ ద్వారా తలెత్తిన సమస్యలపైనా పోరుసలిపారు.

బల్దియాలో అక్రమాలు, మాస్టర్ ప్లాన్‌పై..

కామారెడ్డి బల్దియాలో అక్రమాలపై ఆయన ఈడీ, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు ఫిర్యాదులు చేయడంతో విచారణ జరిగింది. కామారెడ్డి నియోజకవర్గంలో భూకబ్జాలు, అక్రమాలు, అవినీతిపై మున్సి పాలిటీ ముందు ప్రజా దర్బార్ నిర్వహించారు. కామారెడ్డి మాస్టర్ ప్లాన్‌తో రైతులకు జరుగుతున్న అన్యాయంపై ఆయ న చేపట్టిన ఆందోళనలు ఉద్రిక్తతకు దారితీశాయి. 45 రోజుల పాటు ఆందోళనలు కొనసాగా యి. ఈ పోరాటం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించింది. దీంతో ప్రభుత్వం దిగివచ్చి మాస్టర్ ప్లాన్‌ను రద్దు చేస్తున్నట్టు ప్రకటించింది.

ఆలయాలు, కుల సంఘాలకు..

నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో ఆలయాల నిర్మాణం, అభివృద్ధితో పాటు కుల సంఘాలు, ఫంక్షన్ హాళ్ల నిర్మాణానికి వెంకటరమణారెడ్డి సాయం చేశారు. ఆయా అభివృద్ధి పనులకు ఆయన సొంత డబ్బు దాదాపు రూ.60 కోట్లు వెచ్చించారు. ఒకవైపు ప్రజల సమస్యలపై ఉద్యమాలు, పోరాటాలు నిర్వహిస్తూనే మరోవైపు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ జూట్ బ్యాగులు పంపిణీ చేశారు. ఏటా శివరాత్రి మహాజాగరణ కార్యక్రమం నిర్వహించారు. ఇలా పోరాటాలు, ఉద్యమాలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలతో ఆయన నిత్యం జనం నోళ్లలో నానుతూ వచ్చారు. అదే ఆయన విజయానికి బాటలు వేసిందని చెబుతున్నారు.



సొంత మేనిఫెస్టోతో ముందుకు..

రాష్ట్రంలో ఏ రాజకీయ నాయకుడు చేయని మరోసాహసం వెంకటరమణారెడ్డి చేశారు. ఉచిత విద్య, వైద్యం అందించాలన్న తపనతో రూ.150 కోట్లతో సొంత మేనిఫెస్టోను ప్రకటించారు. ప్రతి మండల కేంద్రంలో కార్పొరేట్ బడి, కార్పొరేట్ ఆస్పత్రి నిర్మాణం, కామారెడ్డి జిల్లా కేంద్రంలో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి, కార్పొరేట్ స్కూల్, కాలేజీ నిర్మాణం ఆయన లక్ష్యంగా పెట్టుకున్నారు. అలాగే యువతకు ఉపాధి శిక్షణ కేంద్రం, రైతులకోసం రైతు సేవా కేంద్రాలు, ఊరూరా సీసీ కల్లాల నిర్మాణం ఆయన మేనిఫెస్టోలో ముఖ్యమైనవి. తాను ఎమ్మెల్యేగా గెలిచినా, ఓడినా ఈ మేనిఫెస్టో అమలు చేస్తానని ప్రకటించారు. మేనిఫెస్టోకు సంబంధించిన బుక్‌లెట్‌ను ప్రతి ఇంటికి చేర్చారు.

న్యూస్‌రీల్

కామారెడ్డితో అనుబంధం కొనసాగుతుంది

- రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డి



కామారెడ్డి క్రైం: కామారెడ్డిలో కాంగ్రెస్ ఓటమికి షబ్బీర్‌అలీ ఇక్కడ అందుబాటులో లేకపోవడం ప్రధాన కారణమని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన కామారెడ్డి కౌంటింగ్ కేంద్రం వద్ద విలేకరులతో మాట్లాడారు. షబ్బీర్ అలీ నిజామాబాద్ అర్బన్‌నుంచి పోటీ చేయడంతో ఆయన తన టీంతో సహా నిజామాబాద్‌లో ఉన్నారన్నారు. అయినప్పటికీ కామారెడ్డి కార్యకర్తలు, ప్రజలు మమ్మల్ని ఎంతగానో ఆదరించారని పేర్కొన్నారు. బీజేపీ అభ్యర్థి స్థానికుడు కావడం అతడికి అనుకూలించిందన్నారు. కాంగ్రెస్ ఓటమికి గల కారణాలపై లోతుగా విశ్లేషిస్తామన్నారు. భవిష్యత్తులో పార్టీని మరింత బలోపేతం చేయడానికి పని చేస్తామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటవుతుందని, కామారెడ్డి అభివృద్ధికి ఎళ్లవేళలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. 20 రోజులుగా కామారెడ్డిలో ఉన్నానని, పార్టీతో, కామారెడ్డితో ఈ అనుబంధం ఇలాగే కొనసాగుతుందని పేర్కొన్నారు.

ఇండిపెండెంట్లకు 10,193 ఓట్లు



కామారెడ్డి టౌన్: కామారెడ్డి నియోజకవర్గంనుంచి 25 మంది నిరుద్యోగులు బరిలో నిలిచారు. వారందరికి కలిపి 10193 ఓట్లు వచ్చాయి. సీఎం కేసీఆర్ ఓటమిలో వీరిది ప్రధాన పాత్ర అని భావిస్తున్నారు. దీనిపై స్వతంత్ర అభ్యర్థులు స్పందించారు. కౌంటింగ్ అనంతరం విలేకరులతో మాట్లాడారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వని కేసీఆర్‌కు కామారెడ్డి ప్రజలు సరైన తీర్పుతో బుద్ధి చెప్పారన్నారు. ఆయన ఓటమిలో తాము కీలకంగా మారామన్నారు. వచ్చే ప్రభుత్వమైనా నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలని కోరారు. సమావేశంలో స్వతంత్ర అభ్యర్థులు కే.సంగారెడ్డి, కుంట రవి, పరశురాములు, నర్సింలు, భార్గవి, కలీమొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రశాంతంగా ఓట్ల లెక్కింపు



కామారెడ్డి క్రైం: జిల్లాలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. కామారెడ్డి, జుక్కల్, ఎల్లారెడ్డి నియోజకవర్గాలకు సంబంధించి కామారెడ్డిలోని ఏఎంసీ గోదాంలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్ల మధ్య ఆదివారం ఓట్లను లెక్కించారు. మొత్తం కౌంటింగ్ ప్రక్రియను ఎన్నికల పరిశీలకులతోపాటు కలెక్టర్ జితేష్ వి పాటిల్, అదనపు కలెక్టర్ చంద్రమోహన్, ఎస్పీ సింధు శర్మ పర్యవేక్షించారు. కౌంటింగ్ కేంద్రాలతో పాటు పరిసర ప్రాంతాలలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. కౌంటింగ్ అనంతరం విజేతలకు ధ్రువీకరణపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికలు, కౌంటింగ్ ప్రక్రియ సాఫీగా జరిగిందన్నారు. ఇందుకు సహకరించినవారికి కృతజ్ఞతలు తెలిపారు.

వెలవెలబోయిన 'బీఆర్ఎస్' కార్యాలయం



నిజామాబాద్‌నాగారం: అసెంబ్లీ ఎన్నికల తుది ఘట్టమైన ఓట్ల లెక్కింపులో బీఆర్ఎస్ ఘోర పరాజయం కావడంతో స్థానిక బీఆర్ఎస్ కార్యాలయం నాయకులు, కార్యకర్తలు లేక వెలవెలబోయింది. జిల్లాలోని ఐదు నియోజకవర్గాలైన నిజామాబాద్ అర్బన్, రూరల్, ఆర్మూర్, బోధన్‌లో బీఆర్ఎస్ అభ్యర్థులు ఓడిపోగా బాల్కొండ అభ్యర్థి ప్రశాంత్‌రెడ్డి స్వల్ప మెజార్టీతో గెలుపొందారు. నిన్నటి వరకు భారీ మెజార్టీతో గెలుస్తుందనుకున్న పార్టీ శ్రేణులు ఆదివారం నిర్వహించిన ఓట్ల లెక్కింపులో తలకిందులు కావడంతో పార్టీ కార్యాలయానికి రావడానికి నాయకులు, కార్యకర్తలు సుముఖత చూపలేదు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

ఖలీల్‌వాడి : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం అనేది శుభసూచకమని నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో జరిగిన విజయాలను, అపజయాలను స్వీకరిస్తూ మాజీ మంత్రివర్యులు సుదర్శన్ రెడ్డి నాయకత్వంలో జిల్లాలో ప్రజా సంక్షేమమే దిశగా కాంగ్రెస్ పార్టీ ముందుకు వెళ్తుందన్నారు.

అధికారంలో లేకున్నా తెలంగాణ సేవకులమే



అధికారం ఉన్నా లేకున్నా తాము తెలంగాణ సేవకులమని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. ఆదివారం ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు చేశారు. కష్టపడి పనిచేసినందుకు బీఆర్ఎస్ కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కోసం పనిచేసిన సోషల్ మీడియా వారియర్స్‌కు, కోరుట్ల ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రజల కోసం ఎంతో కృషి చేసిందన్నారు. ప్రజల తీర్పును శిరసావహిస్తామని పేర్కొన్నారు.

నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం

- రెట్టింపు ఉత్సాహంతో నియోజకవర్గాలను అభివృద్ధి చేస్తాం
- పదేళ్ల బీఆర్ఎస్ పాలనకు చరమగీతం పాడిన ప్రజలు
- ఆనందోత్సాహాల్లో బీజేపీ, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

సాక్షి నెట్‌వర్క్: ఏ నమ్మకంతో ప్రజలు అధికారం కట్టబెట్టారో అదే నమ్మకంతో నియోజకవర్గాలను మరింత అభివృద్ధి చేసి చూపిస్తామని ఎన్నికల్లో విజేతలుగా నిలిచిన ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. ఎన్నికల్లో తుది ఘట్టమైన ఓట్ల లెక్కింపులో ప్రజలు అనూహ్యరీతిలో తమ ఓటు తీర్పును వెల్లడించారు. జిల్లాలో గత పదేళ్లుగా ఒకే పార్టీకి పట్టం కట్టిన ప్రజలు ఈ సారి తమ ధోరణి మార్చుకున్న ఆయా నియోజకవర్గ ప్రజలు బీఆర్ఎస్‌తో పాటు బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించారు. దీంతో గెలిచిన అభ్యర్థులు తమ ప్రాంతాలను రెట్టింపు అభివృద్ధి చేసి చూపుతామని, ఓడిన అభ్యర్థులు ఓటర్ల తీర్పును శిరసావహిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో గెలిచిన, ఓడిన తాజా, మాజీ ఎమ్మెల్యేలు, పలువురు తమ ఎన్నికల మనోభావాలను 'సాక్షి'తో పంచుకున్నారు.

స్మార్ట్‌సిటీగా మారుస్తా..



నగరాన్ని స్మార్ట్‌సిటీగా మార్చి ఆదర్శంగా తీర్చిదిద్దుతా. అర్బన్ సూరన్న గెలిచాడంటే ఇందూరు ప్రజలు గెలిచినట్లే.. ఇళ్లు లేని పేదలకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఇళ్లు, ఆరు నెలలకు ఒకసారి జాబ్ మేళా నిర్వహిస్తాం. ప్రజలకు సేవచేసేవ అవకాశం దొరకడం అదృష్టంగా భావిస్తున్నా. నా విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు.

– ధన్‌పాల్ సూర్యనారాయణ

రూరల్‌లో కక్ష సాధింపులు ఉండవు



ఇకపై రూరల్ నియోజకవర్గంలో రాజకీయ కక్ష సాధింపులు ఉండవు. నన్ను ఎమ్మెల్యేగా గెలిపించి ప్రజలు నాపై బాధ్యత పెంచారు. దాన్ని వమ్ము చేయను. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తా. ప్రజలకు ఎల్లప్పుడూ అన్నగా, తమ్ముడిగా అండగా ఉంటాను. పార్టీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పని చేశారు. టికెట్ ఇచ్చిన అధిష్టానానికి కృతజ్ఞతలు.

– భూపతిరెడ్డి

మేనిఫెస్టోను అమలు చేస్తాం



తెలంగాణ ప్రకటించిన కాంగ్రెస్ పార్టీని ఈ ఎన్నికల్లో గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మేనిఫెస్టో ప్రకారం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తాం. తన గెలుపునకు కృషి చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు, అధిష్టానానికి కృతజ్ఞతలు. రాష్ట్ర మంత్రి వర్గంలో స్థానం ఉంటుందని ఆశిస్తున్నా.

– సుదర్శన్ రెడ్డి

ఆరునెలల్లో తేలిపోతుంది



ప్రజా తీర్పును శిరసావహిస్తా. ఎన్నికల్లో గెలుపొందిన కాంగ్రెస్ పార్టీ తమ పనితీరు ఏంటో ఆరునెలల్లో తేలిపోతుంది. కాంగ్రెస్ పాలనకంటే బీఆర్ఎస్ పాలనే బాగుందని ప్రజలు అప్పుడు గుర్తిస్తారు. కాంగ్రెస్ ఆరు హామీలను నెరవేర్చాలంటే రాష్ట్రాన్ని అమ్మాల్సి ఉంటుంది. ప్రజల వెంటే ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా.

– బాజిరెడ్డి గోవర్ధన్

ప్రశ్నించే గొంతుగా ఉంటా



తొలిసారి ఎన్నికల్లో పోటీ చేసినా రూరల్ ప్రజలు స్పందన బాగానే వచ్చినందుకు సంతోషంగా ఉంది. కేవలం డబ్బుతో నడుస్తున్న ప్రస్తుత రాజకీయాల్లో కార్యకర్తలను, ప్రజలను నమ్ముకుని పోటీలో నిలబడ్డా. స్వల్ప మెజార్టీతో ఓడిపోయినా బాధలేదు. ప్రజల తరఫున ప్రశ్నించే గొంతుగా ఉంటా. వచ్చే ఎన్నికల్లో అయినా గెలిపించాలని వేడుకుంటున్నా.

– దినేశ్‌కుమార్

సేవకుడిగా పనిచేస్తా

వేల్పూర్: మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు సేవకుడిగా పనిచేస్తా. కాంగ్రెస్ ఆరు గ్యారంటీల అమలుకు పోరాడుతా. విపక్షాలు విష ప్రచారాలు చేసినా నమ్మకుండా ప్రజలు గెలిపించారు. ప్రత్యర్థులు గంజాయి వ్యాపారం చేస్తున్నామని అబద్ధపు ప్రచారాలు చేసినా ఊరుకున్నా. కాంగ్రెస్, బీజేపీ అబద్ధపు ప్రచారాలకు పాల్పడి ప్రజలను గందరగోళానికి గురి చేయడంతో నాకు మెజారిటీ తగ్గింది కానీ విజయాన్ని ఆపలేకపోయారు.

– వేముల ప్రశాంత్‌రెడ్డి

కామారెడ్డిలో ఉత్కంఠగా కౌంటింగ్



పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కిస్తున్న అధికారులు



కౌంటింగ్ హాల్‌లో సిబ్బంది, ఏజెంట్లు

- కలెక్టర్ కార్యాలయం పక్కన మూడు నియోజకవర్గాల కౌంటింగ్
- నరాలు తెగేలా కామారెడ్డి, జుక్కల్ అభ్యర్థుల లీడింగ్ లెక్కలు
- పలు రౌండ్స్‌లో మొరాయించిన ఈవీఎంలు

కామారెడ్డి టౌన్: అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి కామారెడ్డిలోని కలెక్టరేట్ కార్యాలయం పక్కనగల గోదాంలో కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాల కౌంటింగ్ ప్రక్రియ జరిగింది. ఉదయం 8 గంటలకు ప్రారంభమై, మొదట పోస్టల్ బ్యాలెట్లను లెక్కించారు. తర్వాత ఈవీఎం యంత్రాలలోని ఓట్లను కౌంట్ చేశారు. కామారెడ్డిలో సీఎం కేసీఆర్, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి కాటిపల్లి వెంకటరమణారెడ్డి మధ్య పోటాపోటిగా ఉత్కంఠంగా సాగింది. రాష్ట్రమంతా కామారెడ్డి ఎన్నికలపైనే దృష్టి సారించగా, కౌంటింగ్ రోజు సైతం ఉత్కంఠగా వీక్షించింది. రౌండ్ రౌండ్‌కు తీవ్ర ఉత్కంఠ సాగింది. కామారెడ్డికి సబంధించి మొత్తం 19 రౌండ్స్ ఉండగా కాంగ్రెస్ 3, బీఆర్ఎస్ 5, బీజేపీ 11 రౌండ్‌లలో ఆధిక్యం సాధించాయి. కానీ మొదటి నుంచి కాంగ్రెస్ అభ్యర్థి రేవంత్‌రెడ్డి మెజార్టీతో తీవ్రమైన పోటి ఇచ్చారు. కాంగ్రెస్ మొదటి 12 రౌండ్‌లో మెజార్టీ సాధిస్తూ వచ్చింది. 13వ రౌండ్‌లో మాత్రం ఒక్క సారి బీఆర్ఎస్ 100 మెజారిటీ సాధించింది. ఇక వరుసగా ఆరు రౌండ్‌లలో బీజేపీ మెజారిటీ పెరుగుతూ వచ్చింది. చివరకు 6,741 ఓట్ల మెజారిటీతో వెంకటరమణారెడ్డి విజయం సాధించారు. ఎల్లారెడ్డి అభ్యర్థి మదన్‌మోహన్‌రావు మొదటి రౌండ్ నుంచి మెజారిటీతో వచ్చారు. జుక్కల్ ఎన్నికల ప్రక్రియలో సైతం బీఆరెస్, కాంగ్రెస్‌ల మధ్య హోరాహోరీగా పోరు జరగగా, చివరకు స్వల్ప మెజారిటీతో కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మీకాంతారావు గెలిచారు. కామారెడ్డి నియోజకవర్గంలో నోటాకు 474 ఓట్లు రాగా, పోస్టల్ బ్యాలెట్‌లో 24 చెల్లని ఓట్లు వచ్చాయి. జుక్కల్ నోటాకు 469, చెల్లనివి 199, ఎల్లారెడ్డిలో నోటాకు 61ఓట్లు వచ్చాయి. కామారెడ్డిలో చివరి మూడు రౌండ్లు ఉండగా కాంగ్రెస్ అభ్యర్థి రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డి నిరాశతో వెళ్లిపోయారు. ఎల్లారెడ్డికి సంబంధించి బీజేపీ అభ్యర్థి సుభాష్‌రెడ్డి మధ్యలో వెళ్లిపోయారు. బీఆర్ఎస్ అభ్యర్థి హాజరుకాలేదు. మదన్ మోహన్ ఫలితాలు వెల్లడయ్యాక వచ్చారు. జుక్కల్ బీఆర్ఎస్ అభ్యర్థి హన్మంత్‌సింధే సైతం మధ్యలోనే వెళ్లిపోయారు. బీజేపీ అభ్యర్థి హాజరు కాలేదు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కౌంటింగ్ సెంటర్‌లో హడావుడి నెలకొంది. భారీగా పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేశారు. మొదట జుక్కల్ ఫలితాలు వెల్లడి కాగా, తర్వాత ఎల్లారెడ్డి, కామారెడ్డి ఫలితాలు వచ్చాయి. పలు రౌండ్‌లలో ఈవీఎంలు మొరాయించాయి. కామారెడ్డికి సంబంధించి 217, 218, 219 పోలింగ్ బూత్‌ల ఈవీఎంలు మొరాయించాయి. టెక్నికల్ సిబ్బంది బాగు చేసి తర్వాత లెక్కించారు. ఎల్లారెడ్డి, జుక్కల్‌లో సైతం పలు ఈవీఎంలు మొరాయించాయి. కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ సింధుశర్మ కౌంటింగ్ సరళిని పరిశీలించారు. ప్రశాంతంగా కౌంటింగ్ పూర్తి కావడంతో అధికారులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

ఉత్కంఠ పోరులో బీజేపీ విజయం

కామారెడ్డి టౌన్: రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తి నెలకొన్న కామారెడ్డి నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి కాటిపల్లి వెంకటరమణారెడ్డి గెలుపొందారు. మొదట కాంగ్రెస్ అభ్యర్థి రేవంత్‌రెడ్డి లీడ్‌లో ఉండగా తర్వాత బీజేపీ, బీఆర్ఎస్‌ల మధ్య ఆధిక్యత దోబూచులాడింది. చివరకు వెంకటరమణారెడ్డి బీఆర్ఎస్ అభ్యర్థి కే చంద్రశేఖర్‌రావుపై 6741 ఓట్ల తేడాతో గెలుపొందారు.

కామారెడ్డిలో రౌండ్ల వారీగా ఓట్లు

రౌండ్లు	కాంగ్రెస్	బీఆర్ఎస్	బీజేపీ				
1	3,607	2,695	2,717	11	3,723	2,595	4,154
2	4,051	3,243	2,553	12	1,779	3,315	4,920
3	3,228	2,363	2,555	13	2,591	3,609	3,509
4	2,679	2,476	3,466	14	2,555	3,457	3,758
5	2,701	3,356	2,334	15	1,821	3,061	4,858
6	3,498	3,551	3,158	16	2,780	3,634	3,154
7	2,751	2,870	3,316	17	2,337	3,361	4,295
8	3,922	3,537	3,723	18	2,331	3,234	3,481
9	3,449	4,027	1,977	19	1,545	2,624	4,161
10	3,064	2,625	3,306	పోస్టల్	503	278	1,257
				మొత్తం	54,916	59,911	66652

బాన్సువాడలో పోచారం గెలుపు

బాన్సువాడ: బాన్సువాడ నియోజకవర్గంలో ఉత్కంఠగా సాగిన కౌంటింగ్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి గెలుపొందారు. ఆయన 76,278 ఓట్లు సాధించి సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ అభ్యర్థి ఏనుగు రవీందర్‌రెడ్డిపై 23,464 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. బీజేపీ అభ్యర్థి యెండల లక్ష్మీనారాయణకు 23,685 ఓట్లు వచ్చాయి.

బాన్సువాడలో రౌండ్ల వారీగా ఓట్లు

రౌండ్	బీఆర్ఎస్	కాంగ్రెస్	బీజేపీ	రౌండ్	బీఆర్ఎస్	కాంగ్రెస్	బీజేపీ
1	3,344	2,105	1,376	11	4,301	3,897	1,097
2	4,416	3,311	1,424	12	4,340	2,524	1,304
3	3,764	2,848	1,645	13	3,281	3,121	666
4	3,498	3,070	1,199	14	4,227	2,823	773
5	4,476	2,909	1,924	15	5,012	1,475	1,373
6	3,577	2,226	1,864	16	4,500	3,071	983
7	3,527	2,859	2,079	17	4,555	1,947	2,278
8	4,084	3,567	608	18	4,684	2,277	1,163
9	3,897	3,718	599	19	2,034	1,502	290
10	4,177	3,127	689	పోస్టల్	584	437	351

ఎల్లారెడ్డి 'హస్త'గతం..

- ప్రతిరౌండ్‌లోనూ కాంగ్రెస్ పార్టీ ఆధిక్యత

నాగిరెడ్డిపేట: ఎల్లారెడ్డి అసెంబ్లీ స్థానానికి జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్‌రావు గెలుపొందారు. కామారెడ్డిలో ఆదివారం చేపట్టిన ఓట్ల లెక్కింపు ప్రక్రియలో మొదటి నుంచి కాంగ్రెస్‌దే ఆధిపత్యం కొనసాగింది. మొదటి రౌండ్ నుంచి 20రౌండ్ల వరకు ప్రతిరౌండ్‌లోనూ మదన్‌మోహన్ రావు ఆధిక్యంలో ఉన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి మదన్ మోహన్‌రావు తన సమీప ప్రత్యర్థి బీఆర్ఎస్ అభ్యర్థి జాజాల సురేందర్‌పై 24,001ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. గురువారం జరిగిన పోలింగ్‌లో మొత్తం 1,83,414ఓట్లు పోలయ్యాయి. వీటితో పాటు 1,396 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలయ్యాయి. వాటిలో పోస్టల్‌బ్యాలెట్ ఓట్లతో కలిపి కాంగ్రెస్ అభ్యర్థికి 86,989ఓట్లు, బీఆర్ఎస్ అభ్యర్థి జాజాల సురేందర్‌కు 62,988ఓట్లు, బీజేపీ అభ్యర్థి సుభాష్‌రెడ్డికి 26,709ఓట్లు వచ్చాయి.

ఎల్లారెడ్డిలో రౌండ్ల వారీగా ఓట్లు

రౌండ్	కాంగ్రెస్	బీఆర్ఎస్	బీజేపీ	రౌండ్	కాంగ్రెస్	బీఆర్ఎస్	బీజేపీ
1	4,841	4,063	826	12	5,885	3,699	1,124
2	4,333	4,064	1,375	13	4,733	2,947	1,355
3	4,566	3,727	1,336	14	5,007	3,110	1,103
4	4,648	3,535	1,219	15	4,222	2,621	833
5	3,442	3,166	2,661	16	6,332	3,192	982
6	3,250	2,969	1,560	17	4,595	3,753	1,319
7	3,714	2,853	1,533	18	3,459	2,590	1,296
8	3,961	2,667	2,209	19	4,445	2,960	1,125
9	4,080	3,160	1,396	20	1,547	866	254
10	4,742	3,295	1,473	21(మొరాయించిన ఈవీఎం)			
11	4,157	3,271	1,699		317	147	31

జుక్కల్‌లో కాంగ్రెస్ జయకేతనం

నిజాంసాగర్: బీఆర్ఎస్ పార్టీకి కంచుకోటగా ఉన్న జుక్కల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి తోట లక్ష్మికాంతారావు పాగా వేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు హోరాహోరీగా పోరాడాయి. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియలో మొదటి రౌండ్ నుంచి 10 రౌండ్ల వరకు బీఆర్ఎస్ అభ్యర్థి హన్మంత్ సింధే ఆధిక్యంలో ఉన్నారు. 11వ రౌండు నుంచి 19వ రౌండ్ వరకు కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మీకాంతారావు ముందంజలో ఉండి మొత్తంగా 1,152 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.

రౌండ్ల వారీగా పార్టీలకు వచ్చిన ఓట్లు

రౌండ్	కాంగ్రెస్	బీఆర్ఎస్	బీజేపీ				
1	2,242	3,143	2,041	10	4,489	3,949	1,822
2	3,241	2,802	3,063	11	3,810	3,505	1,824
3	3,417	3,472	1,967	12	2,772	3,169	843
4	3,400	3,653	1,251	13	3,935	3,519	873
5	2,455	3,609	1,206	14	5,015	3,279	1,331
6	2,327	3,130	1,790	15	4,007	3,316	1,611
7	3,402	3,254	1,879	16	4,431	3,600	1,177
8	2,592	3,300	1,005	17	4,155	3,675	1,109
9	3,852	3,979	2,312	18	3,929	4,139	865
				19	645	205	232

వ్యత్యాసాలు భారీగానే..

నిజామాబాద్‌అర్బన్: ఉమ్మడి జిల్లాలో గత 2018, ప్రస్తుత ఎన్నికల్లో అభ్యర్థులు సాధించిన ఓట్లలో వ్యత్యాసాలు భారీగానే ఉన్నాయి. గతంలో అర్బన్ ఎమ్మెల్యేగా గెలుపొందిన గణేశ్‌గుప్తా ఈ ఎన్నికల్లో 27,067 ఓట్ల తేడాతో ఓటమిపాలయ్యారు. గతంలో రూరల్ నుంచి పోటీ చేసిన భూపతిరెడ్డి గతంలో కంటే ప్రస్తుతం 20,048 ఓట్లు అధికంగా సాధించారు. బాజిరెడ్డి గోవర్ధన్ గతంలో కంటే ప్రస్తుతం 31,561 ఓట్లు కోల్పోయారు. బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి గతంలో కంటే ప్రస్తుతం ప్రశాంత్‌రెడ్డి 2,245 ఓట్లు కోల్పోయారు. గతంలో కంటే బాల్కొండ నుంచి పోటీ చేసిన సునీల్‌రెడ్డి ఈ ఎన్నికల్లో 25,370 ఓట్లు తగ్గాయి. పోచారం శ్రీనివాస్‌రెడ్డి బాన్సువాడ నియోజకవర్గంలో గతంలో కంటే 1665 ఓట్లు తగ్గాయి. బోధన్‌లో షకీల్ ఈసారి గతంలో కంటే 10,994 ఓట్లు తగ్గిపోయాయి. ఇదే నియోజక వర్గంలో సుదర్శన్‌రెడ్డికి 169 ఓట్లు మాత్రమే ఎక్కువగా వచ్చాయి. ఆర్మూర్‌లో జీవన్‌రెడ్డికి గతంలో కంటే ప్రస్తుతం 32,730 ఓట్లు తక్కువగా వచ్చాయి. ఇదే నియోజకవర్గంలోని వినయ్‌కుమార్‌రెడ్డికి 23,390 ఓట్లు పెరిగాయి.

2018, ప్రస్తుత ఎన్నికల్లో అభ్యర్థులకు వచ్చిన ఓట్ల వివరాలు

అభ్యర్థి	పార్టీ	నియోజకవర్గం	2018లో ఓట్లు	ప్రస్తుతం
గణేశ్‌గుప్తా	బీఆర్ఎస్	ని.అర్బన్	71,896	44,829
భూపతిరెడ్డి	కాంగ్రెస్	ని.రూరల్	58,330	78,378
బాజిరెడ్డి గోవర్ధన్	బీఆర్ఎస్	ని.రూరల్	87,976	56,415
వేముల ప్రశాంత్‌రెడ్డి	బీఆర్ఎస్	బాల్కొండ	73,662	70,417
సునీల్‌కుమార్	బీఎస్పీ	బాల్కొండ	41,254	65,884 కాంగ్రెస్
పోచారం శ్రీనివాస్‌రెడ్డి	బీఆర్ఎస్	బాన్సువాడ	77,943	76,278
షకీల్‌ఆమేర్	బీఆర్ఎస్	బోధన్	74,895	63,901
సుదర్శన్‌రెడ్డి	కాంగ్రెస్	బోధన్	66,794	66,963
జీవన్‌రెడ్డి	బీఆర్ఎస్	ఆర్మూర్	72,125	39,395
వినయ్‌కుమార్‌రెడ్డి	కాంగ్రెస్	ఆర్మూర్	19,599	42,989
ఏనుగు రవీందర్‌రెడ్డి	బీఆర్ఎస్	ఎల్లారెడ్డి	56,362	52,814 బాన్సువాడ
షబ్బీర్ అలీ	కాంగ్రెస్	కామారెడ్డి	63,610	59,853 ని.అర్బన్
వెంకటరమణారెడ్డి	బీజేపీ	కామారెడ్డి	15,439	66,652
హన్మంత్‌సింధే	బీఆర్ఎస్	జుక్కల్	77,584	63,337
అరుణతార	బీజేపీ	జుక్కల్	18,840	28,437

రైలు కింద పడి ఆత్మహత్య



కామారెడ్డి క్రైం: రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డి రైల్వే బ్రిడ్జి సమీపంలో ఆదివారం వెలుగు చూసింది. వేకువజామున 3 గంటల ప్రాంతంలో గుర్తు తెలియని రైలు రాకను గమనించి రైలుకు ఎదురుగా వెళ్లి అతడు ఆత్మహత్యకు పాల్పడినట్లు రైల్వే పోలీసులు పేర్కొన్నారు. మృతుడి వయస్సు 35 సంవత్సరాలు ఉండవచ్చని రైల్వే ఎస్సై తావూనాయక్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సత్తా చాటిన తాడ్వాయి గడ్డ

ఎల్లారెడ్డి: తాడ్వాయి మండలంతో అనుబంధం ఉన్న ఇద్దరు నేతలు ఎమ్మెల్యేలుగా గెలుపొందడంతో మండలవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కామారెడ్డి అసెంబ్లీ స్థానం నుంచి ఇద్దరు దిగ్గజాలను మట్టి కరిపించి గెలిచిన బీజేపీ అభ్యర్థి కాటిపల్లి వెంకటరమణారెడ్డిది తాడ్వాయి మండలం దేమె గ్రామం. తాడ్వాయి మండలంతో తనకు ఎంతో అనుబంధం ఉందని చెప్తున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందిన మదన్‌మోహన్‌రావు మండలంలోని ఎర్రాపహాడ్‌లోనే తన ప్రాథమిక విద్య.. బాల్యం గడిచిందని గుర్తు చేసుకుంటారు. మండలంలోని ఎర్రాపహాడ్ గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్యే రవీందర్‌రెడ్డి నాలుగు పర్యాయాలు (ఉప ఎన్నికలతో కలిపి) ఎమ్మెల్యేగా గెలుపొందగా ఈ సారి బాన్సువాడ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి పోచారం శ్రీనివాస్‌రెడ్డి చేతిలో పరాజయం పాలయ్యారు.

మొరాయించిన ఈవీఎం

నాగిరెడ్డిపేట: ఎల్లారెడ్డి అసెంబ్లీ స్థానానికి సంబంధించి నియోజకవర్గం పరిధిలోని పోలింగ్ కేంద్రం నం.192 ఫలితాలను అధికారులు ఆఖరులో వెల్లడించారు. సాధారణంగా 14వ రౌండ్‌లో 10వ టేబుల్‌పై 192వ పోలింగ్ కేంద్రంలోని ఈవీఎంలోని ఓట్లను లెక్కించాల్సి ఉంది. కానీ ఆ సమయంలో ఈవీఎం మొరాయించడంతో 20రౌండ్లు పూర్తయిన తర్వాత చివరలో 192వ పోలింగ్‌కేంద్రానికి సంబంధించిన ఈవీఎం ఫలితాలను వీవీప్యాట్‌లోని స్లిప్‌ల ద్వారా వెల్లడించారు. ఇందులో మొత్తం 509ఓట్లుండగా వాటిలో కాంగ్రెస్‌కు 317ఓట్లు, బీఆర్ఎస్‌కు 147, బీజేపీకి 31ఓట్లు వచ్చాయి. మిగతా ఓట్లు ఇతరులకు పడ్డాయి.



విజయసంకేతం చూపుతున్న పైడి రాకేశ్‌రెడ్డి



భూపతిరెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

గెలుపు సంబురాలు

అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలోని ఐదు నియోజకవర్గాల ప్రజలు తమ ఓటు ద్వారా తీర్పు చెప్పారు. బాల్కొండలో ప్రశాంత్‌రెడ్డి, బాన్సువాడలో శ్రీనివాస్‌రెడ్డి గెలుపొందారు. అర్బన్ నుంచి బీజేపీ అభ్యర్థి సూర్యనారాయణ, రూరల్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి భూపతిరెడ్డి, ఆర్మూర్ నుంచి బీజేపీ అభ్యర్థి పైడి రాకేశ్‌రెడ్డి, బోధన్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి గెలుపొందారు.

– సాక్షి నెట్‌వర్క్



సంబురాల్లో పాల్గొన్న ధన్‌పాల్, నాయకులు



ర్యాలీలో మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి



మాట్లాడుతున్న వేముల ప్రశాంత్‌రెడ్డి